ఇంటింటికీ ఓటర్ స్లిప్పులు

చాలా ప్రాంతాల్లో మందకొడిగా స్లిప్పుల పంపిణీ ప్రక్రియ

కుత్బుల్లాపూర్: అంగన్వాడీ, సీఆర్‌పీ సిబ్బందితో కలిసి బూత్ లెవెల్ పర్యవేక్షణలో ఇప్పటికే ఇంటింటికీ తిరుగుతూ ఓటర్ స్లిప్పులను అందజేస్తూ వస్తున్నారు. అసెంబ్లీ నియోజకవర్గంలో మొత్తం 7.24 లక్షల మంది ఓటర్లు ఉండగా పోలింగ్ బూత్‌ల వారీగా ఆయా ఏరియాల్లో ఈ స్లిప్పుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఇప్పటికే ఉపకమిషనర్లు మల్లారెడ్డి, నరసింహులు ఇద్దరు కలిసి బీఎల్‌ఓలతో దగ్గరుండి ఈ స్లిప్పుల పంపిణీ చేపడుతూ ఉన్నారు. చాలాచోట్ల ఈ పంపిన ప్రక్రియ మందకొడిగా సాగుతుందనే ఆరోపణలు ఉన్నాయి.

ఎక్కడికక్కడే వాహనాల తనిఖీలు



చింతల్ క్రాస్ రోడ్డు వద్ద తనిఖీలు చేస్తున్న పోలీస్ సిబ్బంది

కుత్బుల్లాపూర్: ఎన్నికల గడువు దగ్గర పడుతున్న కొద్దీ వాహనాల తనిఖీ వేగం పెంచారు.. డబ్బు, మద్యం ప్రలోభాలకు ఆస్కారం ఇవ్వకుండా ఎక్కడికక్కడే తనిఖీలు చేపడుతూ ముందుకు సాగుతున్నారు. కుత్బుల్లాపూర్ అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పులి సైదులు ఆదేశాలతో చింతల్ క్రాస్ రోడ్ వద్ద ఎస్ఎస్‌టీ ఇన్‌చార్జి లక్ష్మణరావు నేతృత్వంలో సూరారం హెడ్‌కానిస్టేబుల్ సాయిలు, జగద్గిరిగుట్ట కానిస్టేబుల్ భరత్, వీడియో గ్రాఫర్‌తో పలు కార్లు వాహనాలను సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సుమారు 70 వాహనాలను తనిఖీ చేసినట్లు పేర్కొన్నారు.

హెల్ప్‌లైన్ యాప్‌తో ప్రయోజనం

కుత్బుల్లాపూర్: ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని ఓటర్ జాబితాలో పేరు ఉందో..! లేదో..!! తెలుసుకోవడంతో పాటు పోలింగ్ స్టేషన్ వివరాలు తెలుసుకోవచ్చు. ఇప్పటికే చాలామంది ఓటర్ల ఫోన్ నెంబర్లను ఎన్నికల సిబ్బంది సేకరించింది. పోలింగ్ రోజున వారి ఫోన్‌లకు పోలింగ్‌స్టేషన్లకు సంబంధించిన చిరునామాను గూగుల్‌మ్యాప్, ఫోన్‌లలో చూసుకునేలా ఏర్పాటు చేస్తున్నట్లు ఎన్నికల అధికారి సైదులు పేర్కొన్నారు.

రాంగ్ రూట్‌లో నడిపితే క్రిమినల్ కేసులు



రాంగ్‌రూట్‌లో వాహనాలు నడిపిన వారికి కౌన్సెలింగ్ ఇస్తున్న బాలానగర్ ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు

కుత్బుల్లాపూర్: రాంగ్ రూట్‌లో వాహనాలను నడిపి ఇతరులకు ఇబ్బంది కరంగా మారుతూ ప్రమాదాలు చేస్తున్న వ్యకులను గుర్తించి క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నామని బాలానగర్ ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం బాలానగర్ నుంచి షాపూర్‌నగర్ రోడ్డులో ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి పలు యూటర్న్ వద్ద తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ... యూటర్న్ వద్ద మాత్రమే టర్నింగ్ చేసుకోవాలన్నారు. ఇష్టానుసారంగా రాంగ్‌రూట్‌లో వెళ్లి అనేక ప్రమాదాలు జరిగి విలువైన ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. ఇప్పటికే పలు సందర్భాల్లో చలానాలు విధించి వాహనదారుల్లో మార్పు కోరుకున్నప్పటికీ అదే తరహాలో రాంగ్ రూట్‌లో వస్తున్నారని తెలిపారు. రాంగ్‌రూట్‌లో ప్రయాణిస్తే 336 సెక్షన్ కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా రాంగ్‌రూట్‌లో ప్రయాణిస్తూ పట్టుబడిన పలువురు వాహనదారులకు చలాన్‌లు విధించడంతో పాటు కౌన్సెలింగ్ ఇచ్చారు.

కలెక్టరేట్‌లో టోల్‌ఫ్రీ నంబర్ 1800 425 2050

సాక్షి, మేడ్చల్ జిల్లా: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ అన్నారు. కలెక్టరేట్‌లో 24 గంటలు పనిచేసే విధంగా ప్రత్యేకంగా టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల సమయంలో ప్రజల సౌకర్యార్థం ఏమైనా ఫిర్యాదులు ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 1800 425 2050కు ఫోన్ చేసేందుకు అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. దీంతో పాటు రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు డబ్బు తరలింపు, ఇతర ప్రలోభాలకు గురిచేసినట్లు ఎవరైనా గుర్తిస్తే వెంటనే టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.

నేడు రాయదుర్గంకు అన్నామలై రాక

రాయదుర్గం: బీజేపీ తమిళనాడు అధ్యక్షుడు అన్నామలై నేడు రాయదుర్గంకు రానున్నారు. గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్ నాయకత్వంలో మంగళవారం సాయంత్రం 5 గంటలకు బైక్ ర్యాలీని ప్రారంభిస్తారు. ఈ ర్యాలీ మధురానగర్, ఖాజాగూడ, నానక్‌రాంగూడ, విప్రో సర్కిల్, ట్రిపుల్ ఐటీ జంక్షన్, గచ్చిబౌలి సంధ్యా కన్వెన్షన్ వరకు సాగుతుంది.

8న 'మనూ'లో ప్లేస్‌మెంట్ డ్రైవ్

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఈనెల 8వ తేదీన ఉదయం పది గంటలకు పాలిటెక్నిక్ భవనంలో ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తామని 'మనూ' ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ డాక్టర్ యూసుఫ్‌ఖాన్ సోమవారం తెలిపారు. 'మనూ', విజన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఎస్ఎస్‌సీ, ఐటీఐ, డిప్లొమో పూర్తి చేసిన విద్యార్థులకు అవకాశాలు కల్పిస్తారన్నారు.2023–24లో మనూలో ఎస్ఎస్‌సీ, ఐటీఐ లేదా పాలిటెక్నిక్ పూర్తి చేసినవారు, ఇతర పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు ఈ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో పాల్గొనవచ్చన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ యూసుఫ్‌ఖాన్: 9848171044, సమీర్‌పాషా: 9700064077, ప్రదీప్: 8960363488లలో సంప్రదించాలని కోరారు.

శ్రామికుల ఓట్లే కీలకం

మల్కాజిగిరిలో అభ్యర్థుల గెలుపు, ఓటములపై చూపనున్న ప్రభావం

- వేలల్లో పరిశ్రమలు.. అన్ని రాష్ట్రాల నుంచి వలస ఉద్యోగులు, కార్మికులు
- మొత్తం శ్రామికుల సంఖ్య 9,57,853, ఇందులో వలసలు 1,57,326
- భిన్న భాషలు, సంస్కృతులు
- పార్టీ అభ్యర్థులకు అంతు చిక్కని మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం



సాక్షి, మేడ్చల్ జిల్లా: వేలల్లో పరిశ్రమలు.. దేశంలోని అన్ని రాష్ట్రాలు, అన్ని ప్రాంతాలకు చెందిన కార్మిక కుటుంబాలతో సందడి.. అన్ని భాషలు, సంస్కృతులు ఇక్కడ కనిపిస్తాయి. ఇలా మినీ ఇండియాగా పేరుగాంచింది. దేశంలోనే అతిపెద్ద పార్లమెంట్ నియోజకవర్గమైన మల్కాజిగిరి పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు మేడ్చల్, ఉప్పల్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, మల్కాజిగిరి, ఎల్బీనగర్, కంటోన్మెంట్‌ల్లో ఇది స్పష్టమవుతోంది. దేశంలోనే భిన్నమైన లోక్‌సభ నియోజకవర్గంగా మల్కాజిగిరికి పేరుంది. ఇక్కడి రాజకీయ నేతలకు ఇదో సవాల్‌గానే నిలుస్తోంది. ఒక్కసారి పట్టు సాధిస్తే దాన్ని నిలుపుకొనేందుకు ఎన్నో రకాలుగా యత్నించాల్సిందే. ఓ వైపు పరిశ్రమలతో పాటు సాఫ్ట్‌వేర్, వ్యాపారాలు, నిర్మాణ రంగానికి కేంద్రంగా మారింది.

దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి ఉపాధి కోసం తరలివచ్చిన సంఘటిత, అసంఘటిత రంగాల్లో పనిచేసే కార్మికులు, ఉద్యోగులతో జనసంద్రంగా మల్కాజిగిరి నియోజకవర్గం కనిపిస్తోంది. పరిశ్రమలకు కేంద్రంగా విరాజిల్లుతున్న మల్కాజిగిరి లోక్‌సభ పరిధిలో కొత్త పరిశ్రమలు, ఐటీ రంగాలకు అవకాశాలను కల్పిస్తోంది. ఇప్పటికే పలు ప్రధాన పార్టీలు కొంతకాలంగా పట్టుసాధించేందుకు ముందుకు సాగుతున్నాయి.

గెలుపు, ఓటములపై శ్రామికుల ఓట్లే కీలకం

మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో అభ్యర్థుల గెలుపు, ఓటములపై శ్రామికుల(వలస కార్మికుల) ఓటర్ల ప్రభావం చూపనున్నాయి. శ్రామికుల ఖిల్లాగా పేరొందిన మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని జనాభాలో 40 శాతం మంది శ్రామికులే ఉన్నారు. ఉప్పల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, మేడ్చల్, మల్కాజిగిరి, ఎల్బీనగర్ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో శ్రామికులు, ఉద్యోగులు, వివిధ రంగాల్లో పని చేసే అసంఘటిత, సంఘటిత కార్మిక కుటుంబాలు అధికంగా జీవిస్తున్నాయి.

పారిశ్రామిక వాడలిక్కడే..

మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో జీడిమెట్ల, బాలానగర్, కూకట్‌పల్లి, ఉప్పల్, నాచారం, మల్లాపూర్, కుషాయిగూడ, చర్లపల్లి, మౌలాలి, శామీర్‌పేట్, మేడ్చల్ ప్రాంతాల్లో ప్రభుత్వ రంగ పరిశ్రమలతో పాటు ఇంజినీరింగ్, ఫార్మా, ఫుడ్ ఇండస్ట్రీలు ఉన్నాయి. మౌలాలి ప్రాంతంలో ఫ్యాబ్రికేషన్, స్టీల్, ప్లాస్టిక్ ఫర్నీచర్, కెమికల్, ఎలక్ట్రానిక్స్ తరహా పరిశ్రమలు ఉన్నాయి. ఇక్కడున్న కోకాకోలా కంపెనీల్లో కూడా కార్మికులు, ఉద్యోగులు జీవనోపాధి పొందుతున్నారు. బాలానగర్ పారిశ్రామికవాడ పరిధిలో ఫ్యాన్లు తయారు చేసే కంపెనీలు, ఆటోమొబైల్ వస్తువుల తయారీ, బీర్ మాన్యుఫాక్చరింగ్ యూనిట్, ఫాబ్రికేషన్, వైర్ మెష్ యూనిట్లు, ఫుడ్ ప్రొడక్ట్స్, ఫార్మా యూనిట్లు తదితర కంపెనీలు ఉన్నాయి. బీహెచ్‌ఈఎల్, ఆర్‌అండ్‌డీ, హెచ్ఏఎల్, ఐడీపీఎల్ (ప్రస్తుతం ఖాయిలా పడిన పరిశమ) ఎన్ఆర్ఎస్‌ఏ వంటి కంపెనీలు ఉన్నాయి. ఐడీఏ బాలానగర్, ఐడీఏ కూకట్‌పల్లి, సీఐఈ గాంధీనగర్ ఒకే చోట ఉన్నాయి. శామీర్‌పేట్, మేడ్చల్ మండలాల్లో బయోటెక్, కెమికల్, విత్తన చిన్నతరహా పరిశ్రమలు ఉన్నాయి. గుండ్లపోచంపల్లిలో అపరెల్ టెక్స్‌టైల్ పార్కు ఉంది. తుర్కపల్లిలో ఐసీఐసీఐ నాలెడ్జ్ కంపెనీ పేరుతో పరిశ్రమల హబ్ ఏర్పడ్డాయి. ఘట్‌కేసర్, కీసరలో కూడా చిన్న కంపెనీలు ఉన్నాయి. ఈ కంపెనీల్లో వందలాది మంది పని చేస్తున్నారు.



ఐదు అసెంబ్లీ నియోజకర్గాల పరిధిలో..

మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని ఐదు అసెంబ్లీ నియోజకర్గాల పరిధిలో మొత్తం శ్రామికులు 9,57,853 మంది ఉండగా, వివిధ ప్రాంతాల నుంచి వలస వచ్చిన శ్రామికులు 1,57,326 మంది ఉన్నారు. అలాగే, 12,774 భారీ, మధ్యతరహా, సూక్ష్మ పరిశ్రమల్లో 2,33,088 మంది ఉద్యోగులు, కార్మికులు పనిచేస్తున్నారు. ఇందులో తాజాగా జిల్లాలో 2023–24 సంవత్సరంలో కొత్తగా ఏర్పడిన 1,763 సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలతో 10,758 మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయి. వీరంతా నియోజకవర్గం పరిధిలో నివసిస్తున్నారు. అలాగే, కుటీర పరిశ్రమలు, నిర్మాణ రంగాల్లో వేలాదిగా పని చేసే సంఘటిత, అసంఘటిత కార్మిక కుటుంబాలు కూడా వేలల్లో ఇక్కడే ఉంటున్నారు. నూతన పారిశ్రామిక విధానాల్లో భాగంగా మరో 783 భారీ, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలను రూ.12,523 కోట్ల పెట్టుబడులతో ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ కొత్త పరిశ్రమల ఏర్పాటుతో మరో 46,356 మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు లభించనున్నాయి. అలాగే, కుటీర పరిశ్రమలు, నిర్మాణ రంగాల్లో వేలాదిగా పని చేసే సంఘటిత, అసంఘటిత కార్మిక కుటుంబాలు వందలాదిగా ఇక్కడే ఉంటాయి. నూతన పారిశ్రామిక విధానాల్లో భాగంగా జిల్లాలో మరో 783 భారీ, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలను రూ.12,523 కోట్ల పెట్టుబడులతో ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ కొత్త పరిశ్రమల ఏర్పాటుతో మరో 46,356 మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు లభించనున్నాయి. వీరంతా ఇక్కడే జీవనాన్ని సాగిస్తుండటంతో పాటు ఓటు కలిగి ఉన్నారు. వీరి ఓట్లపై ప్రధాన పార్టీల అభ్యర్థుల గెలుపు, ఓటములు ఆధారపడి ఉన్నట్లు స్థానికంగా చర్చ సాగుతోంది.

వివిధ ప్రాంతాల నుంచి..

పరిశ్రమల్లో పని చేసేందుకు ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులు భారీగా తరలివచ్చారు. ఇక్కడే స్థిర నివాసం ఏర్పరుచుకున్న కుటుంబాలు వేలల్లోనే ఉంటాయి. ఇక నిత్యం హైదరాబాద్ పరిసర ప్రాంతాల నుంచి ఇక్కడికి వేలాది మంది ఉపాధి నిమిత్తం రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో నియోజకవర్గంలోని చాలాచోట్ల కొత్త కాలనీలు సైతం ఏర్పడ్డాయి. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు సైతం ఇక్కడే స్థిరనివాసం ఏర్పర్చుకున్నారు. ఐదు నియోజకవర్గాల పరిధిలో వందలాదిగా ఆధునిక వసతులు కలిగిన విల్లాలను నిర్మించారు.



ఎంపీగా గెలిపించండి.. మీలో ఒక్కడిగా ఉంటా



కొత్తపేట మోహన్‌నగర్‌లో స్వతంత్ర అభ్యర్థి వైష్ణవీ ప్రసాద్‌కు మద్దతు తెలియజేస్తున్న శ్రీబాలాజీనగర్ కాలనీ వాసులు

నాగోలు: తనకు ఎలాంటి హై కమాండ్ నాయకులు లేరని ప్రజలే తనకు హైకమాండ్ అని, తనను మల్కాజిగిరి ఎంపీగా గెలిపిస్తే మీలో ఒక్కడిగా ఈ ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మల్కాజిగిరి స్వతంత్ర అభ్యర్థి పెండ్యాల శేషసాయి వరప్రసాద్ (వైష్ణవీ ప్రసాద్) అన్నారు. సోమవారం ఎల్‌బీనగర్ నియోజకవర్గ పరిధిలోని కొత్తపేట డివిజన్ మోహన్‌నగర్‌లోని శ్రీబాలాజీ నగర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వైష్ణవీ ప్రసాద్‌కు ఆత్మీయ సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైష్ణవీ ప్రసాద్‌కు కాలనీ వాసులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. స్థానిక కాలనీ వాసుల సహకారంతో పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసే స్థాయికి ఎదిగానని తెలిపారు. మన పరిధిలో ప్రజా ప్రతినిధులు గెలిచిన నాయకుల వద్దకు వెళితే సమస్యల చెప్పుకునే సమయం కూడా ఇవ్వడం లేదని అన్నారు. మీకు నిత్యం అందుబాటులో ఉండే.. మీదగ్గర ఉండే తనను ఎంపీ గెలిపిస్తే నిరంతరం మీలో ఒక్కడిగా ఉండి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. ప్రజా సంకల్పంతో మాల్కాజిగిరిని అభివృద్ధి పథంలో ముందు ఉంచే అందుకు నిరంతరం కృషి చేస్తానని తెలిపారు బ్రహ్మశ్రీ సుభాష్ పత్రిజీ ఆశీస్సులతో పిరమిడ్ పార్టీ బలపరచిన తన ఫ్లూట్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈసందర్భంగా వైష్ణవీ ప్రసాద్‌కు కాలనీ వాసులు సంఘీభావం తెలియజేశారు. కార్యక్రమంలో శ్రీ బాలాజీ కాలనీ వాసులు గోపాల కిషన్‌రావు, కుమారస్వామి, అరవింద్, శ్రీనివాస్, సుబ్రహ్మణ్యం, లక్ష్మణ్‌రావు వివిధ కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

సుభాష్‌నగర్: ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం ఉదయం సూరారం హెటిరో పరిశ్రమ ఎదురుగా రోడ్డు దాటుతున్న చెత్త సేకరణ కార్మికుడు లకావత్ శేఖర్(58)ను గండిమైసమ్మ నుంచి జీడిమెట్ల వైపు వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శేఖర్ ఎడమ కాలికి తీవ్ర గాయం కావడంతో సమాచారం అందుకున్న పోలీసులు అతన్ని సూరారంలోని మల్లారెడ్డి ఆస్పత్రిలో చేర్పించారు. కాగా ప్రమాదానికి కారణమైన వ్యక్తిని సూరారం కృష్ణనగర్‌కు చెందిన సలావుద్దీన్‌గా గుర్తించి అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అతివేగమే ప్రమాదానికి దారి తీసిందని పోలీసులు నిర్ధారణకు వచ్చారు.



అల్వాల్ లయోలా కళాశాలలో ఈవీఎంల మాక్‌పోల్‌ను లెక్కిస్తున్న ఎన్నికల అధికారులు

కుత్బుల్లాపూర్: మల్కాజ్‌గిరి లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో సోమవారం ఈవీఎంల మాక్‌పోల్‌ను నిర్వహించారు. అల్వాల్ లయోలా కళాశాలలో కుత్బుల్లాపూర్ నియోకవర్గ ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ పులి సైదులు ఆధ్వర్యంలో రాజకీయ పార్టీలు ఎంపిక చేసిన 30 ఈవీఎంలలో వెయ్యి ఓట్లు నమోదు చేశారు. తదనంతరం రాజకీయ పక్షాల ప్రతినిధుల సమక్షంలో ఓట్ల లెక్కింపు చేపట్టారు. ఈవీఎంల పనితీరుపై అపోహలను తొలగించేందుకు ఈ మాక్‌పోల్‌ను నిర్వహించామన్నారు. ఈఆర్‌ఓ నర్సింహులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఘనంగా కొలన్ హన్మంతరెడ్డి జన్మదిన వేడుకలు

నిజాంపేట్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించి హన్మంతరెడ్డిని గజమాలతో సత్కరించారు. కార్యకర్తలు, నాయకులు కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు నర్సారెడ్డి భూపతిరెడ్డి, జ్యోత్స్నా శివారెడ్డి, మహిళా కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, ఐఎన్‌టీయూసీ, మైనార్టీ సెల్ నాయకులు పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొన్నారు.

'కార్మికుల సంక్షేమానికి కేంద్రం కట్టుబడి ఉంది'





మాట్లాడుతున్న బీజేపీ నేత మల్లారెడ్డి, హాజరైన కంపెనీల కార్మికులు

చింతల్: కార్మికుల సంక్షేమానికి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కట్టుబడి ఉందని బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి అన్నారు. సోమవారం చింతల్ జయ్స్ కన్వెన్షన్ హాలులో బాలానగర్‌కు చెందిన శ్రీరామ, ఉషా పరిశ్రమల కార్మికుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన మల్లారెడ్డి కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ.. ఈఎస్ఐ ఆస్పత్రుల్లో సేవలను మెరుగుపరచడంతో పాటు కార్మికుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందన్నారు. కార్మికుల అభ్యున్నతే ధ్యేయంగా పనిచేసి బీజేపీకి వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో మద్దతు ఇవ్వాలన్నారు. మల్కాజ్‌గిరి లోక్‌సభ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీఎంఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు మల్లేశం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయేందర్, జిల్లా నాయకుడు రమేష్,కార్మికులు పాల్గొన్నారు.

చెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



నిజాంపేట్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం చెరువులో లభ్యమైన ఘటన బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాచుపల్లి ఎస్సీకాలనీకి చెందిన చెత్త సేకరించే అంజి సోమవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో బాచుపల్లి బైరాన్ చెరువు వద్ద చెత్త సేకరిస్తుండగా చెరువులో ఓ వ్యక్తి మృతదేహం తేలుతూ కనిపించింది. దీంతో వెంటనే మృతదేహాన్ని చెరువు గట్టుకు తీసుకువచ్చి బాచుపల్లి పోలీసులకు సమాచారం అందించాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహానికి శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టమ్ నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. సదరు వ్యక్తి షార్ట్ ధరించి ఉండటంతో చెరువులోకి దిగి ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడా లేదా మరే ఇతర కారణాలున్నాయా అన్న కోణంలో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గెలిపిస్తే నాయకురాలిగా కాదు.. సేవకురాలిగా పనిచేస్తా.!

మల్కాజ్‌గిరి లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న సునీతామహేందర్‌రెడ్డి, చిత్రంలో శ్రీశైలంగౌడ్, హన్మంతరెడ్డి

కుత్బుల్లాపూర్: మరోసారి బీజేపీకి ఓట్లేసి అధికారం ఇస్తే రాజ్యాంగం పేదలకు కల్పించిన రిజర్వేషన్లు తొలగిస్తారని మల్కాజ్‌గిరి లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్ రెడ్డి అన్నారు. సోమవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలాన్ హన్మంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌ల ఆధ్వర్యంలో చంద్రగిరినగర్, జగద్గిరిగుట్ట, భగత్‌సింగ్‌నగర్, చింతల్, పద్మనగర్ ఫేస్–2 రింగ్‌రోడ్, సుభాష్‌నగర్ బస్టాప్, సుభాష్‌నగర్, సంజయ్ గాంధీనగర్ సూరారం డివిజన్లలో పట్నం సునీతా మహేందర్‌రెడ్డి సుడిగాలి పర్యటన చేస్తూ ప్రచారం చేశారు.

ప్రతి హామీని నెరవేరుస్తా..

◆ మండుటెండలోనూ రోడ్ షోలకు మహిళలు భారీగా తరలివచ్చి సునితమ్మపై అభిమానాన్ని చాటారు. తాము సునితమ్మ అభయహస్తం కోసం ఆమె వెన్నంటే నడుస్తామని చెప్పారు. లోక్‌సభ నియోజకవర్గ సమస్యల పరిష్కారం, అభివృద్ధి కోసం ప్రత్యేక మేనిఫెస్టోను తయారు చేసినట్లు చెప్పారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ విజయానికి ఈ వారం రోజులు పనిచేస్తే తాను ఐదేళ్లు నాయకురాలుగా కాకుండా ప్రజల మధ్యే ఉండి సేవకురాలిగా పనిచేస్తానని మాట ఇచ్చారు.

మీ ఇంటి ఆడపడచుగా ఆదరించి అండగా నిలబడాలి..

◆ సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో మల్కాజ్‌గిరి లోక్‌సభ నియోజకవర్గాన్ని అన్నివిధాల అభివృద్ధి చేస్తానని అన్నారు. ప్రజా సమస్యలపై తనకు సంపూర్ణమైన అవగాహన ఉందన్నారు. రంగారెడ్డి జడ్పీ చైర్‌పర్సన్‌గా ఈ ప్రాంతం అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.మీ ఇంటి ఆడపడచుగా తనను ఆదరించి అండగా నిలవాలని కోరారు. మహిళలు, నిరుద్యోగులు, యువత, రైతులు, వ్యాపారస్తులు సమస్యల పరిష్కారం కోసం నిరంతరం అందుబాటులో ఉండి పనిచేస్తానని అన్నారు.

సునీతమ్మను భారీ మెజారిటీతో గెలిపించాలి

◆ అంతకు ముందు ఇన్‌చార్జి హన్మంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి భూపతిరెడ్డి మాట్లాడుతూ... మంచి మనసున్న నాయకురాలైన సునీతా మహేందర్ రెడ్డిని ఎంపీగా గెలిపించే బాధ్యత అందరిపై ఉందన్నారు. భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్ శోభారాణి, జిల్లా మహిళ అధ్యక్షురాలు లక్ష్మీ, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, ఏ బ్లాక్ అధ్యక్షుడు బండి శ్రీనివాస్ గౌడ్, డివిజన్ అధ్యక్షులు లాయక్, గణేష్, శివ, పండరీ, రైమతుల్లా, శ్రీధర్ రెడ్డి, రాధాకష్ణ, బేకు సీను, కొంపల్లి మాజీ సర్పంచ్ దేవేందర్ నియోజకవర్గ సీనియర్ నాయకులు కూన శ్రీనివాస్ గౌడ్, జేమ్స్, తమ్మని శ్రవణ్, ఐలయ్య గౌడ్, రషీద్, కృష్ణ గౌడ్, నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రచారంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

మల్కాజ్‌గిరిలో కాంగ్రెస్ జెండా ఎగురవేయడం ఖాయం

నిజాంపేట్: మల్కాజ్‌గిరి లోక్‌సభ స్థానంలో కాంగ్రెస్ జెండా ఎగురవేయడం ఖాయమని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి అన్నారు. సోమవారం నిజాంపేట్ కార్పొరేషన్ రాజీవ్ గృహకల్ప, 31, 32, 33 డివిజన్లలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.ఈసందర్భంగా భూపతి రెడ్డి మాట్లాడుతూ... జడ్పీటీసీగా అనుభవమున్న కాంగ్రెస్ అభ్యర్థి సునీతమహేదర్‌రెడిని గెలిపిస్తే స్థానికంగా అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలే విజయాన్ని చేకూరుస్తాయని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో ప్రజా సంక్షేమం కార్యక్రమాలు దిగ్విజయంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో హస్తం గుర్తుపై ఓటేసి అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు చిట్ల దివాకర్, ఆవుల ప్రసన్న యాదవ్, ఏనుగుల శ్రీనివాస్‌రెడ్డి, ఆగం పాండు, ఇంద్రజీత్‌రెడ్డి, ఆవుల పావని, రాజేశ్వరి, సురేష్ రెడ్డి, వీరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, కో.ఆప్షన్ సభ్యుడు తలారీ వీరేష్‌ముదిరాజ్, వాణి, స్టీఫెన్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ సర్వీసెస్ బృందం టీహబ్ సందర్శన

రాయదుర్గం: హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్‌ను ఎవర్నార్త్ హెల్త్ సర్వీసెస్ ప్రపంచ నాయకత్వ బృందం సోమవారం సందర్శించింది. ఈ బృందానికి హెల్త్ సర్వీసెస్ మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ వెంకటాచలం నాయకత్వం వహించారు. టీహబ్ బృందంతో పాటు భారత్‌లోని సంస్థ హెచ్‌ఆర్ డైరెక్టర్ యదుకిషోర్ వారికి స్వాగతం పలికారు. ఈ బృందం ఆరోగ్య సంరక్షణ ఆవిష్కరణలను పరిశీలించింది. ఆరోగ్య సంరక్షణ, సాంకేతికతలో టీహబ్ యొక్క పర్యావరణ వ్యవస్థ స్టార్టప్‌ల ప్రతినిధులు, డైనమిక్ కమ్యూనిటీతో వారు చర్చలు జరిపారు. ఆరోగ్య సంరక్షణ, ఇతర సాంకేతిక పురోగతిలో కలిసి పనిచేయాలని నిర్ణయించారు.

కోవిడ్ టీకా బాధితులకు పరిహారం ఇవ్వాలి

సాక్షి, సిటీబ్యూరో: కోవిడ్ టీకా వేసుకోవడం వల్ల ఎంత మందికి సైడ్ ఎఫెక్ట్ వచ్చాయనే సమాచారాన్ని సేకరించి, వారికి తగిన నష్టపరిహారం అందించాలని అవేకన్ ఇండియా మూమెంట్ ప్రతినిధులు సరస్వతి, నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... టీకా వేసుకున్న తరువాత ఆరోగ్య సమస్యలు ఎదురైతే వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రత్యేకమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. టీకా వల్ల సైడ్ ఎఫెక్ట్స్ వస్తున్నాయని 2021లోనే గుర్తించినప్పటికి ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. తయారీదారులే సైడ్ ఎఫెక్ట్స్ ఉన్నాయని ఒప్పుకుంటున్నారని, ప్రభుత్వం తగు చర్యలు తీసుకో వాలని డిమాండ్ చేశారు.